
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 3 ఏప్రిల్ 2025






నడకదారిలో సగం మెట్లు దాటగానే అలసిపోతున్నారు. ఛాతీ నొప్పితో కుప్పకూలుతున్నారు. నిర్జీవులుగా మారుతున్నారు కొందరు.

తిరుమలలోని ముఖ్య ప్రదేశాల్లోనూ మరికొందరు గుండె పట్టుకుని విలవిలలాడుతూ కూర్చుంటున్నారు. ఆస్పత్రికి తీసుకెళ్లే సరికి విగతజీవులవుతున్నారు.

ఇలా దైవదర్శనానికి వచ్చే భక్తుల్లో గుండెపోటు మరణాలు ఇటీవల పెరిగాయి. ఏడాది కాలంలో దాదాపు 157 మంది భక్తులు గుండెపోటుతో మృతి చెందడం టీటీడీని కలవరపరిచింది. ఈ క్రమంలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది.



నడకదారుల్లో గుండెపోటు



ఇటీవల పెరిగిన మరణాలు

తిరుమలలోని ముఖ్య ప్రదేశాల్లోనూ ఇదే పరిస్థితి

ఏడాది కాలంలో 157 మంది మృత్యువాత

నివారణపై దృష్టిసారించిన టీటీడీ

అలిపిరి నడకమార్గం

తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి దర్శనానికి వచ్చేవారిలో దాదాపు 40 శాతం మంది భక్తులు తమకున్న మొక్కుల మేరకు అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గాల్లో తిరుమలకు చేరుకుంటారు. అయితే కొవిడ్ అనంతరం కాలినడకన వచ్చే భక్తుల్లో చాలా మంది గుండెపోటుతో మృతి చెందుతుండటం టీటీడీకి ఆందోళన కలిగిస్తోంది. అప్పటివరకు బాగానే ఉన్న యాత్రికులు ఛాతీ నొప్పి అంటూ కుప్పకూలిపోయి కుటుంబానికి దూరమవుతున్నారు. ఒక కాలినడక మార్గాల్లోనే కాకుండా కంపార్టుమెంట్లు, క్యూలైన్లు, తిరుమలలోని కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లోనూ గుండెపోటు మరణాలు నమోదవుతున్నాయి.





గతేడాది డిసెంబరు 13న మృతిచెందడానికి ముందు అలిపిరిలో సీహెచ్ రవికుమార్ (ఇన్‌సెట్‌లో) రవికుమార్ మృతదేహం

ఇదీ లెక్క

గతేడాది జనవరిలో 14 మంది, ఫిబ్రవరిలో 11, మార్చిలో 12, ఏప్రిల్ 7, మే 8, జూన్ 11, జూలై 17, ఆగస్టు 9, సెప్టెంబరు 15, అక్టోబరు 10, నంబరు 8, డిసెంబరు 10, ఈఏడాది జనవరి 15, ఫిబ్రవరి 8, మార్చిలో (ఇప్పటి వరకు) ఇద్దరు చొప్పున 157 మంది గుండెపోటుతో చనిపోయారు. కాగా, మరికొందరు తీవ్ర అస్వస్థతతో తిరుపతిలోని వివిధ ఆస్పత్రుల్లో చేరి మృతి చెందిన సందర్భాలూ ఉన్నాయి.





గతేడాది డిసెంబరు14న మృతిచెందడానికి ముందు అలిపిరిలో సెల్ఫీ తీసుకున్న నవనీత్.. (పక్కన) నవనీత్ మృతదేహం

ఏడో మైలు వద్ద అపోలో కేంద్రం

మరోవైపు శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం అపోలో సంస్థ కొన్నేళ్లుగా ఉచితసేవలు అందిస్తోంది. అశ్విని ఆస్పత్రి పక్కనే ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఛాతీ నొప్పి అంటూ వచ్చేవారికి వివిధ రకాల పరీక్షలు చేయడంతో పాటు అత్యంత ఖరీదైన టెనెక్టిప్లెస్ అనే ఇంజెక్షన్ కూడా ఉచితంగా వేస్తున్నారు. ఇక, నడక మార్గాల్లో పెరుగుతున్న గుండెపోటు మరణాలను దృష్టిలో పెట్టుకుని అలిపిరి మెట్ల మార్గంలోని ఏడో మైలు వద్ద అపోలో సంస్థ 'అత్యవసర హృదయ చికిత్స కేంద్రం' ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. త్వరలోనే ఈసీజీ, డీఫిబ్ రిలేటర్, ఎకో కార్డియోగ్రామ్ వంటి పరికరాలతో వైద్యులను నియమించనున్నారు.

మరణాల నివారణ కోసం..

కాలినడకన వస్తూ తీవ్ర అలసటతో చాలా మంది భక్తులు మృతిచెందినట్టు టీటీడీ గుర్తించింది. అలాగే అనారోగ్యంతో ఉన్నవారూ మొక్కు తీర్చుకోవాలనే మొండితనంతో కొండెక్కుతూ చనిపోయినట్టు కూడా వైద్యుల ద్వారా తెలిసింది. ఈక్రమంలో శ్రీవారి దర్శనం కోసం వస్తూ గుండెపోటుతో ఇకపై ఎవరు మరణించకూడదనే లక్ష్యంతో టీటీడీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. 60 ఏళ్ల దాటిన వృద్ధులు, గుండె సంబంధిత, మధుమేహం, అధిక రక్తపోటు, ఉబ్బసం, మూర్ఛ వంటి వ్యాధులున్న వారు కాలినడకన వెళ్లడం మంచిది కాదంటూ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా టీటీడీ సూచిస్తోంది.

- అలిపిరి నడకమార్గంలో ఇప్పటికే 1,500వ మెట్టు, గాలిగోపురం, భాష్యకార్ల సన్నిధి ప్రాంతాల్లో డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో సరిపడా వైద్యులను ఏర్పాటు చేయాలనే అధికారుల ఆదేశాల మేరకు గుండెకు సంబంధించిన ప్రత్యేక నిపుణలు ఏర్పాటు చేశారు. ఒక్కో డిస్పెన్సరీలో నలుగురు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాల్లో ఈసీజీ, డీ ఫిబ్‌రిలేటర్ వంటి పరికరాలను, క్యాన్వాస్ స్ట్రెచర్స్‌ను సమకూర్చుకున్నారు.
- ఇక, శ్రీవారిమెట్టు మార్గంలోని 1,200వ మెట్టు వద్ద కూడా మరో డిస్పెన్సరీని ఏర్పాటు చేసే అంశంపై టీటీడీ ప్రణాళిక రూపొందించుకుంటోంది.
- భక్తులు దర్శనం కోసం వేచిఉండే వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో ఉన్న డిస్పెన్సరీలోనూ సరిపడా వైద్యులను ఏర్పాటు చేయనున్నారు.
- వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోనూ నూతన డిస్పెన్సరీ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. ఇటీవల 13 మంది వైద్య సిబ్బందిని కూడా కొత్తగా నియమించారు. ఇక, భక్తులు ఏదైనా ఇబ్బందికి గురైతే వైద్యులు వచ్చేవరకు నిరీక్షించకుండా సమీపంలోని సిబ్బందే సీపీఆర్ చేసేలా శిక్షణ ఇస్తున్నారు.

పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చేటప్పటికి అతడు ఓ అనుమానితుడు మాత్రమే. విచారించాక తెలిసింది అతడు కర్ణాటక రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ దొంగ అని. అలాంటి నిందితుడిని రిసెప్షన్ గదిలో వదిలేశారు. ఎంచక్కా అతడు పరారయ్యాడు. ఇంతటి నిర్లక్ష్యానికి బాధ్యులుగా ఇద్దరు ఐడీ పార్టీ కానిస్టేబుళ్లను సస్పెండు చేసినా.. అధికారుల పాత్ర ఎంతన్న ప్రశ్నలూ ఎదురవుతున్నాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఈ నిర్లక్ష్యానికి బాధ్యులెవరు?

- అంతర్రాష్ట్ర దొంగ పరారీ ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు
- అధికారుల వైఖరిపైనా తలెత్తుతున్న ప్రశ్నలు

బెంగళూరు సమీపం యలహంకకు చెందిన గొల్ల ఎల్లప్ప కొందరితో కొలిసి అక్కడి వెంట్రుకల గోడౌన్‌లో దొంగతనం చేశాడు. దీనిపై సూలదేవరహళ్లి పోలీసులు కేసు నమోదుచేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం ఎస్కార్ట్‌తో స్టేషన్‌కు తీసుకొస్తుండగా పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. అతడి కోసం కర్ణాటక పోలీసులు ముమ్మురంగా గాలిస్తున్నారు. రెండు, మూడు రాష్ట్రాల క్రైం ఐడీ పార్టీ గ్రూపుల్లో ఇతడి వివరాలు, ఫొటోలు ఉంచారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం రేణిగుంట వారపు సంతలో అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న ఓ వ్యక్తిని ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు సూరి, సోమశేఖర్ పట్టుకుని అర్బన్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అతడి వేలిముద్రలు, కనుబొమ్మలు, ఫొటోలు పరిశీలించగా కర్ణాటక రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ దొంగగా గుర్తించారు. స్టేషన్‌కు పక్కనే ఉన్న రిసెప్షన్ గదిలో ఉంచారు. కర్ణాటక పోలీసుల నుంచి తప్పించుకున్న ఇతడిని గట్టి బందోబస్తు మధ్య స్టేషన్ లాకప్‌లో ఉంచాల్సిపోయి.. అలా నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఎల్లప్ప పారిపోయాడు. దీనికి బాధ్యులెవరన్నది చర్చనీయాంశంగా మారింది. వారపు సంతలో నుంచి నిందితుడిని స్టేషన్‌కు తీసుకొచ్చాక బాధ్యత ఎవరిది? తీసుకొచ్చిన వాళ్లదేనా? స్టేషన్‌లో సెంట్రీ లేరా? నిందితుడు పారిపోకుండా అధికారులు చేపట్టిన చర్యలేంటి? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. రేణిగుంట స్టేషన్‌లో సెంట్రీ.. రిసెప్షన్ డ్యూటీలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. ఇందులో అధికారుల బాధ్యతపైనా సమగ్ర విచారణ జరపాల్సిన అవసరముంది.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

రేణిగుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్ పోలీసు స్టేషన్ నుంచి అంతర్రాష్ట్ర దొంగ పరారైన ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండయ్యారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి బుధవారం ఆంధ్రజ్యోతిలో 'అంతర్రాష్ట్ర దొంగ పరార్' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఎస్పీ హర్షవర్ధన రాజు స్పందించి, పూర్తి నివేదిక అందజేయాలంటూ డీఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ మేరకు ఐడీ పార్టీకి చెందిన కానిస్టేబుళ్లు సూరి, సోమశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.



జూపార్కు రోడ్డులోని టీసీఎస్ అయాన్ డిజిటల్ జోన్‌లో జరిగిన పరీక్షకు హాజరైన విద్యార్థులు





జేఈఈ మెయిన్స్-2 పరీక్షలు ప్రారంభం

- రెండు సెషన్లలో 1088 మంది హాజరు
- ఆలస్యంతో వెనుదిరిగిన ఇద్దరు అభ్యర్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2 పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జూపార్క్ సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్‌లో ఈనెల 9 వరకు ఈపరీక్షలు జరుగనున్నాయి. ఉదయం సెషన్‌కు 601 మందికిగాను 40 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 555 మందికిగాను 28 మంది గైర్హాజరయ్యారు. ఎన్‌టీఏ సూచనల మేరకు ఉదయం సెషన్‌కు రెండు గంటలు ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. వీరిని సిబ్బంది నిశితంగా తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించారు. సెల్‌ఫోన్లు, వాచ్‌లు లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలనే కాకుండా ఆభరణాలు,తలకు పెట్టుకునే క్లిప్పులు, ముంజేతులకు కట్టిన దైవ సంబంధిత తాళ్లపైనా అభ్యంతరం తెలియజేశారు. ఫుల్‌హ్యాండ్స్ టీషర్టులు, ఎత్తు మడమల చెప్పులు, ఎక్కువ జేబులున్న జీన్స్ ప్యాంట్లు ఉన్నా అనుమతించలేదు. అర్ధగంట ముందుగానే అంటే ఉదయం 8.30 గంటలకే కేంద్రం గేట్లు మూసివేశారు. గేట్లు మూసివేశాక 8.40 గంటలకు ఇద్దరు విద్యార్థులు పరుగున వచ్చినా అధికారులు అనుమతించలేదు. వారిద్దరూ నిరాశగా వెనుదిరిగారు. అడ్మిట్ కార్డులో నిబంధనల మేరకు పత్రాలతో, డ్రస్ కోడ్‌తో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ కైలాష్‌నాథ్ అభ్యర్థులకు సూచించారు.



గేటు మూసేయడంతో..

గంజాయి నిందితుల్లో జీఆర్పీ కానిస్టేబుల్

- 5 కిలోలు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో జీఆర్పీ కానిస్టేబుల్ సహా ఇద్దరు పట్టుబడ్డారు. ఈ వివరాలను గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ బుధవారం రాత్రి వెల్లడించారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అవినాష్ సూళ్లూరుపేటలో జీఆర్‌పీ ఓపీలో కానిస్టేబుల్. గతేడాది నుంచి ట్రైన్‌లో బీట్ డ్యూటీకి వెళ్లినపుడు పోలీసులను చూసి నిందితులు వదిలేసిన గంజాయిని గుట్టుగా ఇంటికి తీసుకొచ్చేవాడు. తన స్నేహితుడు సునీల్ ద్వారా కిలో రూ.15వేల చొప్పున విక్రయించేవాడు. ఇందులో కిలోకు రూ.2వేలు సునీల్‌కు కమీషన్ ఇచ్చేవాడు. గత నెల 23వ తేదీన సునీల్ ద్వారా తిరుపతికి చెందిన వ్యక్తులకు రెండు కిలోల గంజాయి విక్రయించాడు. బుధవారం 5 కిలోల గంజాయిని తన స్కూటర్‌లో తీసుకొచ్చి సునీల్ ద్వారా అమ్మించేందుకు అవినాష్ ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు గోపాల్, సుబ్రహ్మణ్యం రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వడమాలపేటలో పట్టుబడిన తల్లీ కొడుకులు



పుత్తూరు అర్బన్/ వడమాలపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చేసిన తప్పునే మళ్లీ చేసి పట్టుబడిందో మహిళ. ఈసారి కుమారుడు తోడయ్యాడు. పుత్తూరు ఎక్సైజ్ సీఐ, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా వడమాలపేటలో దాడులు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తూ వడమాలపేట గుంటకట్టకు చెందిన కె.వల్లెమ్మ, ఆమె కుమారుడు డిల్లీప్రసాద్ పట్టుబడ్డారు. ఈమె ఇంట్లో తనిఖీ చేయగా రూ.9,600 విలువైన 700 గ్రాముల గంజాయి, లావాదేవీలు జరిపిన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు. కాగా, వల్లెమ్మ 2016-17లో గంజాయి కేసులో అరెస్టయి ఏడాది జైలు శిక్ష అనుభవించడంతో పాటు రూ.10 వేలు జరిమానా చెల్లించినట్లు సీఐ మురళీ మోహన్ తెలిపారు. ఎస్‌ఐలు శివప్రసాద్, స్వామినాథన్, సిబ్బంది పాల్గొన్నారు.

మాకొక ఇన్‌చార్జి కావలెను!

- టీడీపీ కేంద్ర కార్యాలయానికి సత్యవేడు పంచాయితీ



పల్లా శ్రీనివాసరావును కలిసిన టీడీపీ నేతలు

సత్యవేడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ టీడీపీ వ్యవహారం మరోసారి వార్తల్లో నిలిచింది. ఎమ్మెల్యే ఆదిమూలం తీరుపై నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు అసంతృప్తి వ్యక్తం చేస్తూ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే స్థానంలో ఎవరినైనా ఇన్‌చార్జిని నియమించాలని కోరినట్లు సమాచారం. ఏపీ యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ నరసింహయాదవ్ ప్రమాణ స్వీకారానికి నియోజకవర్గం నుంచి విజయవాడకు వెళ్లిన టీడీపీ నేతలు ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కేంద్ర కార్యాలయంలో కలిసి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వైసీపీ నేతలకే ఆయన ఎక్కువ ప్రాధాన్యమిస్తూ టీడీపీ నేతలను అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు, బాధలు పడ్డామని, ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చినా అవే పరిస్థితులు ఎదుర్కొంటున్నామని ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిసింది. నియోజకవర్గంలో అధికారుల నుంచి సిబ్బంది వరకు వైసీపీ నేతల మాటలే చెల్లుబాటు అవుతున్నాయని, దీనికి ఎమ్మెల్యే కుమారుడి ప్రమేయమే ప్రధాన కారణమని పల్లాకు వారు వివరించినట్లు సమాచారం. ఎమ్మెల్యే ఆదిమూలంతో వేగలేమని త్వరలో నియోజకవర్గానికి ఇంచార్జిని నియమిస్తే తామందరం కలిసి పనిచేస్తామని, లేకుంటే పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పినట్లు తెలిసింది. నియోజకవర్గ టీడీపీ నేతల ఫిర్యాదు విన్న పల్లా.. మీకు ఇంచార్జిగా ఎవరు కావాలని అడగ్గా పలువురు మాజీ ఎమ్మెల్యే హేమలత పేరు ప్రస్తావించినట్లు సమాచారం. పార్టీ అధినేత చంద్రబాబుతో చర్చించి ఈ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.



నరసింహయాదవ్ చేత ప్రమాణం చేయిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నరసింహయాదవ్ అను నేను..

యాదవ సంక్షేమాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తుడా మాజీ చైర్మన్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈయనతో పాటు డైరెక్టర్ల చేత మంత్రి అచ్చెన్నాయుడు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి






లగేజీ కౌంటర్ వద్ద భక్తుల రద్దీ - నడక మార్గంలో..



పాదాల మండపం వద్ద..

అలిపిరిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్, టెన్త్ పరీక్షలు పూర్తి కావడంతో తిరుమలకు భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో అలిపిరిలో హడావుడి నెలకొంది. కాలినడక వెళ్లే వారితో పాటు వాహనాలు, లగేజీ డిపాజిట్ చేసే ప్రాంతంలో రద్దీ నెలకొంది.





సూర్యప్రభ వాహనంపై శ్రీరామచంద్రుడు - చంద్రప్రభ వాహనంపై కోదండరాముడు

సూర్య, చంద్రప్రభలపై శ్రీరామచంద్రుడి తేజస్సు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై కొలువుదీరి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రథోత్సవానికి సంబంధించి రథంపై ఏర్పాటు చేసే బంగారు గొడుగుకు ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపుగా రథంపై ప్రతిష్ఠించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. గురువారం ఉదయం రథోత్సవానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది.ఉదయం 5.15గంటలకు మీనలగ్నంలో స్వామివారు రథారోహణం చేస్తారు. మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో భిక్షగాడి మృతి

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో భిక్షగాడు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ రామకృష్ణ వివరాల మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి రైల్వేస్టేషన్ పరిసరాల్లో భిక్షాటన చేస్తుండేవాడు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం రైల్వేస్టేషన్‌లో మృతి చెందాడు. ఈస్ట్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఖననం చేయాలని రైల్వే పోలీసులకు సూచించారు. దీనిపై కేసు నమోదు కాలేదని సీఐ రామకృష్ణ చెప్పారు.



మిస్టర్ ఆంధ్రగా ఎంపికైన ప్రసన్నకుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ, ప్రేమ్ వెల్‌నెస్ సెంటర్ అధినేత డాక్టర్ స్వప్నప్రియ, రవి రాజేంద్ర, కల్యాణి, పూర్ణ చంద్రరావ్, సు బ్రమణ్యం, పృథ్వీ తదితరులు

గ్రీన్‌పార్కు అపార్ట్‌మెంటును ఆదర్శంగా తీసుకోండి



గ్రీన్ పార్కు అపార్ట్‌మెంటు వద్ద చెత్త నిర్వహణ పాయింట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి) : గ్రీన్‌పార్క్ అపార్ట్‌మెంట్ యాజమాన్యం ఏర్పాటు చేసిన చెత్త నిర్వహణ పాయింట్‌ను ఆదర్శంగా తీసుకుని తక్కిన అపార్ట్‌మెంట్ల వద్ద కూడా ఇలాగే చేసేలా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కోరారు. నగరంలోని గ్రీన్‌పార్క్ అపార్ట్‌మెంట్, డీఆర్ మహల్ రోడ్డు, హరేరామ హరే కృష్ణ మార్గం, న్యూ బాలాజీ కాలనీలోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్, అన్నా క్యాంటీన్‌ను అధికారులతో కలసి బుధవారం ఆమె పరిశీలించారు. నగరంలోని పలుచోట్ల భవన నిర్మాణ వ్యర్థాలు ఉంటున్నాయని, వాటిని వెంటనే శుభ్రం చేయించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఇస్కాన్ వంటశాల తరహాలో తడిచెత్తతో గ్యాస్ ఉత్పత్తి చేసుకునేలా హోటల్స్ యాజమాన్యాలకు అవగాహన కల్పించాలన్నారు. అన్నా క్యాంటీన్‌లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఎస్‌ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు మహేష్, రమణ, మధుబాబు, ఏసీపీ బాలాజి ఆమె వెంట ఉన్నారు.

దివ్యాంగ నిరుద్యోగులకు కంప్యూటర్, సాఫ్ట్‌స్కిల్స్‌పై ఉచిత శిక్షణ

తిరుపతి(గాంధీరోడ్డు), ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): భవానీనగర్ ఆంజనేయస్వామి గుడి సమీపంలోని యూత్ అండ్ జాబ్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని దివ్యాంగ నిరుద్యోగులకు కంప్యూటర్ కోర్సులు, సాఫ్ట్‌స్కిల్స్‌పై ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఎం.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా విద్యార్హత కలిగి 18-35 సంవత్సరాలలోపు వయసు ఉన్న దివ్యాంగులు అర్హులని తెలిపారు. శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హత ధ్రువపత్రాలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్‌తో ఈనెల 4వ తేదీలోపు నేరుగా సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 7702020490, 9347411952లను సంప్రదించాలని కోరారు.

పరిశ్రమల్లో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రసాయన ఉత్పత్తుల పరిశ్రమల్లో ప్రమాద నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల్లో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రమాదం జరిగినపుడు అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించేలా ఉండాలని సూచించారు. పరిశ్రమల్లో సంబంధిత అధికారుల సమక్షంలో మాక్‌డ్రిల్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజరు సుధాకర్‌రావు, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



కళారత్న పురస్కారం అందుకున్న రచయిత కంపల్లె రవిచంద్రన్‌ను టీటీడీ పత్రిక సప్తగిరి సంపాదకుడు డాక్టర్ కె. రాధారమణ, సంపాదకుడు డాక్టర్ వి.జి.చొక్కలింగం, పత్రిక సిబ్బంది అభినందించి, సత్కరించారు.

- తిరుపతి (కల్చరల్), ఆంధ్రజ్యోతి

శివ అద్వైతం ప్రత్యేకం

శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రధాన అర్చకుడు పరశురామ్ గురుకుల్



పరశురామ్ గురుకుల్‌ను సత్కరిస్తున్న వీసీ రాణిసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక అంశాల్లో శివ అద్వైతానికి ప్రత్యేకత ఉందని శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రధాన అర్చకులు పరశురామ్ గురుకుల్ పేర్కొన్నారు. వైఖానస ఆగమంపై 21 రోజులుగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో చేపట్టిన వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. సమాపనోత్సవంలో పరశురామ్ గురుకుల్ మాట్లాడుతూ ఆలయాల్లో నిర్వహించే పూజా విధానాల్లో అనేక అంశాలు ఉన్నాయన్నారు. భగవంతుడి అనుగ్రహం పొందడానికి అవి తోడ్పడతాయన్నారు. వేద వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివమూర్తి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ విజయవంతంగా సాగిందంటూ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సంస్కృత వర్సిటీ ప్రొఫెసర్ రంగనాథ్, వేద వర్సిటీ రిజిస్ట్రార్ భాస్కరుడు, నిర్వాహకులు రామకృష్ణ, భరతశేఖరాచార్యులు, కార్తికేయన్, బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

వెంకటరమణకు దళితరత్న పురస్కారం



వెంకటరమణను అవార్డుతో సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

తిరుపతి (గాంధీరోడ్డు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతికి చెందిన ఎస్.వెంకటరమణకు అంబేడ్కర్ దళితరత్న అవార్డు లభించింది. ఇటీవల మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, రిపబ్లిక్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఆయన్ను పలువురు అభినందించారు.

తిరుపతి బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

తిరుపతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా గొట్టి గజేంద్ర, ఉపాధ్యక్షుడిగా ఓరుగంటి మునెయ్య, ప్రధాన కార్యదర్శిగా వై.విద్యానాథరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా పి.చంద్రమోహన్, కోశాధికారిగా జి.రమేష్, లైబ్రరీ కార్యదర్శిగా వి.సునీల్‌కుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా వి.నాగరాజ, లేడీ రెప్రజంటేటివ్‌గా కోమలదేవి ప్రమాణ స్వీకారం చేశారు. వీరిని సీనియర్, జూనియర్ న్యాయవాదులు సత్కరించి, అభినందించారు.

బీసీ విద్యార్థులకు మెస్‌ఛార్జీలు పెంచండి

తిరుపతి(గాంధీరోడ్డు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టల్స్‌లో చదివే విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యు.నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సంఘ ఆధ్వర్యంలో బుధవారం ఏపీ సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మకు వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. బీసీ హాస్టళ్లకు శాశ్వత భవనాలు కేటాయించాలని, బాలికల వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న వార్డెన్, వాచ్‌మెన్, హెల్పర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పోటీ పరీక్షలకు ఫీజు మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు.

వెటర్నరీలో సీమపందుల పెంపకంపై శిక్షణ

తిరుపతి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతుల్లో సీమపందుల పెంపకంపై మూడ్రోజుల వ్యవస్థాపక నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, డీఈ ప్రొఫెసర్ డాక్టర్ శోభామణి శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. శాస్త్రీయ పరిజ్ఞానాన్ని సాధించి ఔత్సాహికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. సీసీవీఈసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.సుజాత, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.కల్యాణ చక్రవర్తి, డాక్టర్ జి.గంగరాజు, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మంజిరి, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన యువత, ఔత్సాహిక రైతులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను అందుబాటులో తీసుకురండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని గిరిజన నవ సమాజ అధ్యక్షుడు శివశంకరనాయక్ కోరారు. ఈ మేరకు వీసీని కలిసి బుధవారం విన్నవించారు. రూ.30 లక్షలతో యూనియన్ బ్యాంకు అంబులెన్స్ ఇచ్చిందన్నారు. అయితే అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉంచడం లేదన్నారు. దీనిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో బాలు, దిలీప్, చంద్ర పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత భవిష్యత్తు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి

తిరుపతి (విద్య), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత భవిష్యత్తును అందుకోవచ్చని విశ్వం విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన పాలిటెక్నిక్, ఏపీ ఆర్జేసీ నమూనా ప్రవేశ పరీక్ష, అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య ద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని, ఇతర కోర్సులు, కార్పొరేట్ సంస్థల్లో ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్‌కు సంబంధించి విశ్వం విద్యాసంస్థల్లో మేలైన శిక్షణ ఉంటుందని, ఇతర వివరాలకు 8688888802, 9399976999లను సంప్రదించాలని సూచించారు.



వైకుంఠం-1 వద్ద కొత్త షెడ్

● రూ.300 దర్శన భక్తుల కోసం..

నిర్మాణంలో రూ.300 దర్శన భక్తుల అదనపు షెడ్

తిరుమలలో వైకుంఠం1 క్యూకాంప్లెక్స్ వద్ద కొత్త షెడ్ నిర్మాణం జరుగుతోంది. గతంలో రూ.300 దర్శన భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్ ప్రస్తుతం ఇరుకుగా మారిపోయింది. క్యూలైన్ కూడా వెలుపలకు వచ్చేస్తోంది. దీంతో రూ.300 దర్శన టికెట్లు బుక్ చేసుకుని దర్శనానికి వస్తున్న భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని గుర్తించిన టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అదనపు షెడ్‌ను నిర్మించాలని సూచించారు. సమాచారకేంద్రం వద్దనున్న డిస్ప్లే టీవీ వద్ద నుంచి వైకుంఠం1 కాంప్లెక్స్ ప్రవేశం వరకు అదనపు షెడ్ నిర్మాణం కోసం రూ.1.06 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇది పూర్తయితే వెయ్యి నుంచి 1,500 మంది భక్తులు ఇందులో వేచి ఉండవచ్చు. నెలలో ఈ షెడ్ భక్తులకు అందుబాటులోకి రానుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గ్రానైట్ క్వారీలో పేలుళ్లు

● బాలుడికి తీవ్ర గాయాలు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సమీపంలోని చెర్లోపల్లెలో గ్రానైట్ క్వారీలో పేలుళ్ల కారణంగా రెండేళ్ల బాలుడు దినేష్ తలకు తీవ్ర గాయమైంది. స్థానికుల కథనం మేరకు.. కృష్ణంరాజుకు చెందిన మామిడి తోటలో రమేష్ కుటుంబం కాపలాగా ఉంటుంది.ఆ పక్కన గ్రానైట్ క్వారీలో బుధవారం మధ్యాహ్నం నిర్వాహకులు పేలుళ్లు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ రాయి రమేష్ కుమారుడు దినేష్‌కు తగలడంతో తలకు తీవ్రగాయమైంది. బాలుడిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నట్టు సమాచారం.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.5.09 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,981

తలనీలాలు సమర్పించినవారు: 21,120



ఇప్పుడు గోదాముకు ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డు



గత ఏడాది డిసెంబరులో ఏకొల్లులోని గోదాము చుట్టూ చేరిన వర్షపు నీరు (ఫైల్ ఫొటో)

చెరువులో గోడౌన్

● వైసీపీ పాలనలో ముందుచూపు లేక రూ.40 లక్షలతో నిర్మాణం
● వర్షాల్లో జలదిగ్బంధంలో చిక్కుకున్న వైనం
● ఇప్పుడు మరో రూ.27 లక్షలతో సిమెంటు రోడ్డు
● అధికారుల తీరుపై విమర్శలు

చెరువులో గోదాము కట్టొద్దని అప్పుడే రైతులు మొత్తుకున్నారు. అయినా, నాటి వైసీపీ పాలనలో చెవికెక్కించుకోలేదు. కట్టి తీరతామన్నట్లు భీష్మించారు. ఫలితం.. ఆ తర్వాత వర్షాలకు నీళ్లల్లో చిక్కుకుపోయిందా గోదాము.

ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చింది. అయినా, అధికారుల తీరు మారలేదు. చెరువులోని ఆ గోదాముకు రూ.27 లక్షలతో కొత్తగా రోడ్డేశారు. వైసీపీ పాలకులు చేసిన తప్పును కప్పిపుచ్చడానికే ఈ పని చేశారన్న విమర్శలు వస్తున్నాయి.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

రైతులు ధాన్యం నిల్వ చేసుకుని, సరైన మద్దతు ధరకు అమ్ముకునేలా 2022లో వైసీపీ ప్రభుత్వం దొరవారిసత్రం మండలానికి నాలుగు గోదాములను మంజూరు చేసింది. ఒక్కోదానికి నాబార్డు ద్వారా ఎన్‌డీసీసీబీ రుణంతో రూ.40 లక్షలు మంజూరు చేశారు. నెలబల్లి, ఏకొల్లు, వేణుంబాక, తొగరాముడి గ్రామాల్లో.. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వీటిని నిర్మించారు. నాటి వైసీపీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఏకొల్లు గోదామును అనువైన ప్రదేశంలో నిర్మించలేదు. ఏకొల్లు రోడ్డుకు పక్కనే, రెడ్డిగుంట చెరువులో నిర్మించారు. దీనివల్ల ఆ గోదాము రైతులకు ఉపయోగపడదనే విషయాన్ని అధికారులు నిర్లక్ష్యంగా తీసుకొన్నారు. దీంతో లక్ష్యం మంచిదైనా ఆచరణలో నీరుగారింది. గత వర్షాకాలంలో చెరువు నీరు గోదామును చుట్టుముట్టేయడంతో రైతులంతా ఆవేదన వ్యక్తంచేశారు.



సిమెంట్ రోడ్డు పనులకోసం.. పక్కనే చెరువు మట్టి తీయడంతో ఏర్పడిన గుంత

దీనిని గుర్తించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శిస్తున్నారు. ఇలా గత ప్రభుత్వంలో రూ.40 లక్షలను 'నీటి'పాలు చేశారు.

ఆ రోడ్డూ అంతంతమాత్రమే

2023-24లో నీటిలో గోదాము జలదిగ్బంధమైన వైనాన్ని అధికార యంత్రాంగం కళ్లారా చూసినా మేలుకోలేదు. సరికదా మరో తప్పిదానికి పాల్పడింది. రూ.27 లక్షలతో అక్క సిమెంట్ రోడ్డు వేయించింది. ప్రస్తుత ప్రభుత్వం రోడ్లకు నిధులు ఇవ్వడాన్ని అధికారులు తమకు అనుకూలంగా మలచుకుని.. గతంలో తమ తప్పు బయటపడకుండా ఆదరాబాదరాగా లోతట్టు ప్రాంతంలోని గోదాముకు రోడ్డు వేయించారు. దీనికితోడు అక్కడే ఉన్న చెరువులో తవ్విన మట్టితో రోడ్డు వేశారు. దీనిపైనే సిమెంట్ రోడ్డు వేశారు. మట్టి పనుల్లో కనీసం రోలింగ్ నియమాన్ని పాటించలేదనే విమర్శలున్నాయి. రోడ్డుకు ఆనుకునే మట్టిని తవ్వారు. సిమెంట్ రోడ్డు పనుల్లోనూ నాణ్యత కొరవడింది. వర్షాకాల ంలో ఈ రోడ్డు వరద తాకిడికి కొట్టుకుపోయే ప్రమాదముందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సమీపంలోనే తెలుగంగ కాలువ ఉంది. ఈ కాలువకు గత డిసెంబరులో పడిన గండిని ఇప్పటికీ పూడ్చలేదు. ఆ గండి ద్వారా వరద నీరొస్తే గోదామును ముంచెత్తుతుందంటున్నారు. జాతీయ రహదారి పక్కన ఖాళీ భూమిలో గోదాము నిర్మించి ఉంటే ఉపయోగపడే బాగుండేదని రైతులు చెబుతున్నారు.

వీఆర్‌కు గాజులమండ్యం హెడ్ కానిస్టేబుల్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డిని వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ హర్షవర్ధన రాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు ఎనిమిదేళ్లుగా ఒకేచోట ఉంటున్న ఈయనపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినట్లు తెలిసింది. దీనిపై ఎస్పీ సందిస్తూ స్పెషల్ బ్రాంచ్ అధికారులను విచారణకు ఆదేశించారు. వీటన్నింటిపై సమగ్రంగా విచారణ చేపట్టిన ఎస్‌బీ అధికారులు ఎస్పీకి నివేదిక సమర్పించారు. దీనిపై వెంటనే హెడ్ కానిస్టేబుల్ పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డిని వీఆర్‌కు పంపుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరైనా సరే భూదందాలు, సెటిల్‌మెంట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ సీనియర్ నేత ధనంజయులు మృతి



ధనంజయులు నాయుడు (ఫైల్ ఫొటో)

తిరుపతి(ఉపాధ్యాయ నగర్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, తిరుపతికి చెందిన గాలి ధనంజయులు నాయుడు(83) మృతిచెందారు. బైరాగిపట్టెడ ఎంకే నాయుడు కాలనీలోని ఆయన స్వగృహంలో బుధవారం సాయంత్రం కార్డియాక్ అరెస్ట్‌తో తుదిశ్వాస విడిచినట్టు ఆయన కుమార్తె, బీజేపీ నాయకురాలు గాలి పుష్పలత చెప్పారు. ఈయన 1977కు ముందునుంచే జనతా పార్టీలో పనిచేశారు. 1980లో బీజేపీగా రూపాంతరం చెందడంతో అందులోనూ చురుగ్గా పనిచేశారు. 1985లో బీజేపీ నగర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1990లో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 1999లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. తన కుమార్తె గాలి పుష్పలతను వారసురాలిగా రాజకీయ క్షేత్రంలోకి దింపారు. కుమారుడు గాలి భరత్ కుటుంబం అమెరికాలో ఉండటంతో ఆయన వచ్చాక శుక్రవారం ఉదయం గోవిందధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పార్థివదేహాన్ని స్విమ్స్ మార్చురీలో భద్రపరిచారు.





విద్యుత్ దీపాలంకరణలో దర్గా, ఆర్చి

నేటినుంచి హజరత్ అమీర్‌షావలి ఉరుసు

● ఎమ్మెల్యే విజయశ్రీ చొరవతో 8 ఏళ్ల తరువాత ప్రారంభం

నాయుడుపేట/టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో హిందూ.. ముస్లింల ఐక్యతకు ప్రతీకగా.. కులమతాలకు అతీతంగా జరుపుకునే హజరత్ అమీర్‌షావలి గంధోత్సవ వేడుకలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. 3, 4, 5 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉరుసు ఉత్సవాలను మొదటసారి 1960లో ప్రారంభించారు. అప్పటి నుంచి హిందూ.. ముస్లింలు కులమతాలకు అతీతంగా ఐక్యతతో ఉరుసు జరుపుకుంటుండంతో ప్రత్యేకత సంతరించుకుంది. 2016 వరకు నిర్విఘ్నంగా సాగిన ఉరుసు ఉత్సవాలు... నిర్వహణ విషయమై వివాదాలు నెలకొనడంతో 2017 నుంచి ఆగిపోయాయి. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం చొరవ తీసుకొని కమిటీ సభ్యులతో సంప్రదింపులు జరిపి ఈ ఏడాది ఉరుసు నిర్వహించేందుకు కృషి చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 3వ తేదీ గురువారం రాత్రి శ్రీవారి గంధం... దొర్నాదుల చెంచుకృష్ణయ్య ఇంటి వద్ద నుంచి బయలుదేరి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, ఫకీర్ల భజనల నడుమ పట్టణంతా ఊరేగి తెల్లవారుజామున దర్గా వద్దకు చేరుకొని రాపూరు వారి చేత చదివింపులు స్వీకరిస్తారు. 4వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు నిస్మి ఈవెంట్స్ ఆధ్వర్యంలో సినీ పాటకచ్చేరి. 5వ తేదీ శనివారం మధ్యాహ్నం అన్నదానం, రాత్రి జబర్దస్త్ టీమ్ ఆర్కెస్ట్రా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉరుసు ఉత్సవాలకు ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు రానుండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, 14 మంది ఎస్‌ఐలు, 212 మంది పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

● 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి
● 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉంటూ మరణించిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారసులకు వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో నిరసన చేపట్టాయి. ఫ్యాప్టో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ కరోనా సమయంలో మరణించిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు ఇవ్వకపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 2003 డీఎస్సీ వారిని పాతపెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయనందున ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో, డైట్ ప్రిన్సిపాల్, డీఈవో పోస్టులు అందని ద్రాక్షలా మారాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన 3 పెండింగ్ డీఏను వెంటనే విడుదల డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సీహెచ్ రమేష్, గాజుల నాగేశ్వరరావు, శేఖర్, రామచంద్రయ్య, మురళీకృష్ణ, జగన్నాథం, రమేష్, బాలసుబ్రహ్మణ్యం, విశ్వనాథ్, మల్లికార్జున, లక్ష్మయ్య పాల్గొన్నారు.



ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు ప్రారంభం

● పర్యవేక్షించిన ఇన్‌చార్జి వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్యా పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో 53 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో కల్పించిన వసతుల పట్ల వీసీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణపై కోర్టు, యూజీసీ, డెబ్ ఆదేశాలు పాటిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

● 1.85 లక్షల జవాబు పత్రాలు.. 775 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి 9వ తేది వరకు తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరగనుంది. దీనిని అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ బుధవారం వెల్లడించారు. జిల్లాకు 1.85 లక్షల జవాబు పత్రాలను కేటాయించారు. వీటి మూల్యాంకనంకోసం ఇద్దరు చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు, 130 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 775 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 260 మంది స్పెషల్ అసిస్టెంట్లు, 10 మంది అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లను నియమించారు. అలాగే ఓపెన్ స్కూల్‌కు సంబంధించి జిల్లాకు 16,324 జవాబు పత్రాలను కేటాయించారు. వీటి మూల్యాంకనానికి 21 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 100 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 21 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. ప్రతి ఎగ్జామినర్ రోజుకు 40 పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. వేసవి నేపథ్యంలో కేంద్రంలో ఫ్యాన్లు, లైట్లు, విస్తృతంగా ఏర్పాటు చేశామని డీఈవో కుమార్ చెప్పారు.

పోలీసుల అదుపులో ఆరుగురు కిడ్నాపర్లు!

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలు.. మీ సేవలో నెలకొన్న విభేదాల కారణంగా రాజేష్ కుటుంబాన్ని కిడ్నాప్ చేసిన ఘటనలో ఆరుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఈనెల 29న తిరుపతి నగరం అక్కారాంపల్లికి చెందిన అరుణ్, జీవకోనకు చెందిన భార్గవ్‌తో పాటు రేణిగుంటకు చెందిన మరో నలుగురు కలిసి కిడ్నాప్ చేసిన విషయం విదితమే. రాజేష్, భార్గవ్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఎలాగైనా రాజేష్ నుంచి రూ.రెండు కోట్లు దండుకోవాలనే దురుద్దేశంతో కిడ్నాప్‌కు పథకం రచించారు. దీనికోసం సెటిల్‌మెంట్లు, భూ దందాల్లో ఆరితేరిన అరుణ్‌ను సంప్రదించాడు. ఆ ప్రకారం ఈ నెల 29న రాజేష్‌ను అపార్టుమెంటు వద్దకు రావాలని ఫోనులో పిలిచాడు. గతంలో తన వద్ద తీసుకున్న రూ.20 లక్షలను తిరిగివ్వాలని రాజేష్ కొంతకాలంగా అడుగుతుండటం, భార్గవ్ వైఖరిపై అనుమానంతో ఇతడు తల్లి విజయ, భార్య సుమతి, ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్లాడు. తనకు రూ.రెండు కోట్లు ఇవ్వాలని భార్గవ్, అరుణ్ కలసి రాజేష్‌ను అడగ్గా అంత డబ్బులు లేవని చెప్పారు. అయితే ఇల్లు, ఆస్తులు రాసివ్వాలని బెదిరించారు. దీనికోసం రాజేష్‌ను ఒక కారులో, అతడి కుటుంబ సభ్యులను మరో కారులో ఎక్కించుకుని బెంగుళూరు వైపు వెళ్లారు. ఈ సందర్భంగా కిడ్నాపర్లు కొన్ని మారణాయుధాలతో బెదిరించినట్లు సమాచారం. రాజేష్ తప్పించుకోవడం, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అందరినీ వదిలేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రధాన నిందితుడైన అరుణ్‌తో పాటు భార్గవ్, రేణిగుంటకు చెందిన మరో నలుగురిని అలిపిరి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఘటన జరిగిన మరుసటి రోజు కిడ్నాపర్ల కదలికలపై సీఐ రాంకిషోర్, అలిపిరి ఎస్‌ఐలు నాగార్జున రెడ్డి, లోకేష్ బాబు నిఘా ఉంచి చాకచక్యంగా బెంగళూరు, హైదరాబాదుకు వెళుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇద్దరు ప్రధాన నిందితులపై రౌడీషీట్లు ఓపెన్ చేసే యోచనలో పోలీసులున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నరసింహరావు

భూగర్భ డ్రైనేజీ క్లీన్ చేస్తూ కార్మికుడి మృతి

● అపస్మారక స్థితిలో మరో ఇద్దరు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్ పాలెంలో భూగర్భ డ్రైనేజీలో వ్యర్థాలను తొలగించే క్రమంగా ఊపిరాడక కార్మికుడు నాగరాజు(41) మృతి చెందగా, మరో ఇద్దరు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇక్కడి భూగర్భ డ్రైనేజీలో వ్యర్థాలు నిల్వచేరి.. మురుగు ముందుకు సాగక దుర్వాసన వస్తోంది. దీనిని శుభ్రం చేసేందుకు బుధవారం నలుగురు కూలీలు వచ్చారు. మ్యాన్‌హోల్ నుంచి నాగరాజు లోపలకు దిగారు. వ్యర్థాలను కాస్త తొలగించగా, ఎగువ నుంచి మురుగునీరు వచ్చింది. ఆ దుర్వాసన, వాయువులతో ఊపిరాడక అపస్మారక స్థితికి చేరారు. పది నిమిషాల తరువాత నాగరాజును పిలిచినా స్పందన లేకపోవడంతో తోట గురవయ్య అనే మరో కార్మికుడు దిగారు. ఎంతసేపటికీ వీరిద్దరు బయటకు రాకపోవడంతో శివ, తుపాకుల ధర్మ లోపలకు దిగారు. అప్పటికే నాగరాజు మృతి చెందగా, గురవయ్య అపస్మాకర స్థితిలో ఉన్నారు. వెంటనే నాగరాజు మృతదేహంతో పాటు గురవయ్యను బయటకు తీసుకొచ్చారు. అదే సమయంలో శివ కూడా అపస్మారక స్థితికి చేరారు. వెంటనే షార్ రోడ్డులోని సతీష్‌ధావన్ మెమోరియల్ వైద్యశాలకు తరలించారు. ప్రథమిక చికిత్స అనంతరం తోట శివ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ నరసింహారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనేది ఆరా తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నాగరాజు స్వగ్రామం సూళ్లూరుపేట మండలంలోని దావాదిగుంట. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



నాగరాజు (ఫైల్‌ఫొటో)



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోట శివ



జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

ఎస్వీయూలో చిరుత దాడిలో జింక మృతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో ఓ జింకను చిరుత చంపినట్టు తెలుస్తోంది. ఈ ఘటనను బుధవారం సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుత సంచారం ఆనవాళ్లను పరిశీలించారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. కొన్ని రోజులుగా ఎస్వీయూలో సెంట్రల్ లైబ్రరీ, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, ఇంజినీరింగ్ కాలేజీ పరిసరాల్లో చిరుత సంచారం కనిపిస్తోంది. లైబ్రరీ, ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంతాల్లో కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు జింకలను చంపడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, మాధవనాయుడు తదితరులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రజలు తమకు తెలియజేసిన ప్రతి సమస్యనూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, ఎలింబేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం



సూపర్ మార్కెట్‌లో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సూళ్లూరుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్‌లో బుధవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. జీఎన్‌టీ రోడ్డులో ఉన్న ఆర్‌ఆర్ సూపర్ మార్కెట్‌లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి పొగలు కమ్ముకొన్నాయి. అక్కడ పనిచేసే సిబ్బంది గుర్తించిన మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేయడంతో పెద్దగా ఆస్తినష్టం జరగలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

సముద్రతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



సముద్రతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు

వాకాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఓడపాళెం సముద్రతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులు తొలగించారు. చిట్టమూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం ఓడపాళెం సముద్ర తీరంలో విహారయాత్రకు వెళ్లారు. అక్కడి ప్లాస్టిక్ వ్యర్థాలను గమనించిన ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం సముద్రతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు భరత్ మహిపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న ట్రస్ట్ ఎండీ చాగణం గౌరీశంకర్

పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి ఏప్రిల్ 2: పెళ్లకూరులోని చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్, తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు భావన, శ్రీలలిత 150 మందికి వైద్య పరీక్షలు చేసి 45 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి, వారిని తిరుపతి అరవింద ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరో 40 మందికి ఉచితంగా కంటి అద్దాలు, 60 మందికి మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ సీఈవో సీతారామనాయుడు మాట్లాడుతూ రోగులకు ఉచితంగా శస్త్రచికిత్స చేయించడంతో పాటు రానుపోను రవాణా ఖర్చులు, మందులు, భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరీశంకర్, ఏవో కృష్ణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ నిరుద్యోగులకు కంప్యూటర్, సాఫ్ట్‌స్కిల్స్‌పై ఉచిత శిక్షణ

తిరుపతి(గాంధీరోడ్డు), ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): భవానీనగర్ ఆంజనేయ స్వామి గుడి సమీపంలోని యూత్ అండ్ జాబ్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని దివ్యాంగ నిరుద్యోగులకు కంప్యూటర్ కోర్సులు, సాఫ్ట్‌స్కిల్స్‌పై ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఎం.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా విద్యార్హత కలిగి 18-35 సంవత్సరాలలోపు వయసు ఉన్న దివ్యాంగులు అర్హులని తెలిపారు. శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హత ధ్రువపత్రాలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్‌తో ఈనెల 4వ తేదీలోపు నేరుగా సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 7702020490, 9347411952లను సంప్రదించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

వాకాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మనస్పర్థలతో పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగబాబు తెలిపిన వివరాల మేరకు.... శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం జగనాథపురం గ్రామానికి చెందిన అమీర్తి జ్యోతి(38), దిలీప్ 15 సంవత్సరాలుగా వాకాడులోని బజారువీధిలో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దిలీప్ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం రాత్రి భార్య, భర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా జ్యోతి పురుగుల మందుతాగి అపస్మారకస్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

టీడీపీ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి: పాశిం

చిల్లకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని తొణుకుమాల పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధితో పాటు పేదల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. తొణుకుమాల పంచాయతీలో రూ.30లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీలు, మినీగోకులాలు, పశువుల కోసం నీటిగుంటలు వంటి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం సూపర్-6 పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 9 సార్లు విద్యుత్‌చార్జీలు పెంచి పేదలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు పేదల ఇళ్లపై సోలార్‌సిస్టం ఏర్పాటు చేసి విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు చర్యలు చేపట్టారన్నారు. పేదలను పేదరికం నుంచి విముక్తి చేసేందుకు సీఎం చంద్రబాబు పలు ప్రణాళికలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తానంకి నానాజీ, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, నెల్లటూరు చిరంజీవి, మేకల కుమార్, భాస్కర్, త్రివిక్రమ్‌భూపతి, రాజశేఖర్‌రెడ్డి, గుండాల లీలావతి, నెల్లటూరు సుప్రజ, చెరుకూరు పద్మజ, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, వెంకటకృష్ణయ్య, శంకరయ్య, శివ, మునిశేఖర్‌గౌడ్, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపినాథ్, ఏపీడీ వరప్రసాద్, ఏపీవో గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పశువుల నీటిగుంట నిర్మాణానికి భూమి పూజచేసి గుంతను తవ్వుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, తానంకి నానాజీ

రెండు దశాబ్దాల శ్మశాన సమస్య పరిష్కారం



పీకర్లదిబ్బలో భూములను సర్వే చేస్తున్న తహసీల్దారు, సర్వేయర్లు

కోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కోట మండలం అల్లంపాడు పంచాయతీలోని పీకర్లదిబ్బలో శ్మశానభూమి సమస్యకు బుధవారం రెవెన్యూ అధికారులు పరిష్కారం చూపి మోక్షం కల్పించారు. పీకర్లదిబ్బలో శ్మశానభూమిని కొంత మంది కబ్జాచేసి రొయ్యల గుంటలుగా మార్చే ప్రయత్నాలు చేశారు. స్థానికంగా ఉన్న ఎస్సీ, బీసీలు ఆ భూమిలో శవాలను పూడ్చి పెట్టకుండా అడ్డుకొంటూ వచ్చారు. దీంతో స్థానికులు శ్మశానభూమి సమస్యకు పరిష్కారం చూపాలని తహసీల్దారు జయజయరావుకు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఆయన మండల సర్వేయర్ గోపీరెడ్డి, విలేజ్ సర్వేయర్లతో భూమిని సర్వే చేయించారు. 1.25 సెంట్ల ప్రభుత్వ భూమిని గుర్తించి శ్మశాన అవసరాలకు కేటాయించారు. శ్మశాన భూమి సమస్య ఎట్టకేలకు పరిష్కారం కావడంతో పీకర్లదిబ్బ వాసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



చిన్నారిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన 8 ఏళ్ల చిన్నారిని పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. బుధవారం వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఏవీ రమణ మీడియాతో మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఏడుకొండలు తన కూతురు నరసమ్మతో కలిసి మంగళవారం రాత్రి 10.30గంటలకు వెంకటగిరి బంధువుల ఇంటికి వచ్చారు. ఏడుకొండలు మద్యం మత్తులో కూతురిని వదిలేసి వెళ్లిపోయాడు. పట్టణంలోని త్రిభువని సెంటర్ వద్ద రాత్రి పూట నరసమ్మ ఒక్కటే ఉండడంతో పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు దంపతులు ఆరా తీసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. చిన్నారి నుంచి వివరాలు సేకరించిన పోలీసులు బుచ్చిరెడ్డిపాళెంలో ఉంటున్న తాత పెంచలయ్య, రమణమ్మను పిలిపించి నరసమ్మను అప్పగించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సుబ్బారావు, ఏఎస్‌ఐ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: పాశిం

చిట్టమూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం చిట్టమూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో మనోహర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన గ్రీవెన్స్ డేలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే పింఛన్లు పెంచి పంపిణీ చేస్తుండగా, ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ప్రారంభించామన్నారు. వచ్చే నెలలో తల్లికి వందనం పథకం కింద ప్రతి బిడ్డకూ రూ.15 వేలు తల్లుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. అలాగే గూడూరు నియోజకవర్గంలో 8వేల పక్కా గృహాలకు పొజిషన్ సర్టిఫికెట్లు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చిట్టమూరు మండలంలో రూ.4.50 కోట్లతో సిమెంట్ రోడ్లు నిర్మించామన్నారు. కాగా, గ్రీవెన్స్ డేలో 175 మంది అర్జీలను సమర్పించగా ప్రతి అర్జీని ఎమ్మెల్యే పరిశీలించారు. అన్ని అర్జీలకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని ఆరూరుకు చెందిన అల్లెమ్మ పింఛను మంజూరు చేయాలని కోరారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని గుర్తించిన ఎమ్మెల్యే పింఛను మంజూరు అయ్యే వరకు ప్రతి నెలా వెయ్యి రూపాయలు అల్లెమ్మ ఇవ్వాలని తన సిబ్బందికి సూచించారు. అదేవిధంగా కోగిలి వడ్డికండ్రి గ్రామానికి చెందిన గుంజి చెంగయ్య మందుల ఖర్చులకు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సతీష్ కుమార్, సీఐ హుస్సేన్ భాషా, టీడీపీ మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు, నాయకులు మస్తాన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జనార్దనరెడ్డి, భారతమ్మ, హరికృష్ణారెడ్డి, రాజేష్‌రెడ్డి, చిట్టిరెడ్డి, చెంచురామయ్య, చిన్నారావు, కస్తూరయ్య, గిరి నాయుడు, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

గ్రామాల అభివృద్ధికి సహకరించండి



అపాచీ పరిశ్రమలో ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. బుధవారం మాంబట్టు సెజ్‌లోని అపాచీ పరిశ్రమను ఎమ్మెల్యే సందర్శించారు. పరిశ్రమ యాజమాన్యంతో పలు విషయాలపై చర్చించారు. సీఎస్‌ఆర్ నిధులు ఖర్చుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సూళ్లూరుపేట మండలంలో అభివృద్ధి పనులకు సీఎస్‌ఆర్ నిధులు ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమ జీఎం ముత్తు గోవిందస్వామి మాట్లాడుతూ యాజమాన్యంతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్మికులకు, ఉద్యోగులకు ఈఎస్‌ఐ సేవలు సక్రమంగా అందడం లేదని, ఆస్పత్రి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే మాంబట్టు సెజ్‌రోడ్డు గుంత లమయమై ఉందని, మరమ్మతులు చేయాలని కోరారు. దీనిపై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పార్థసారధి, సెల్వం, వేలూరు చంద్రయ్య, టీకే శ్రీనివాసన్, బొమ్మన శ్రీధర్, మాధవ నాయుడు పాల్గొన్నారు.

అమీర్‌షావలి దర్గాకు పూజా సామగ్రి వితరణ



పూజా సామాగ్రి అందజేస్తున్న ఇమ్రాన్, తాజ్‌ఉద్దీన్

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దర్గావీధిలోని హజరత్ అమీర్‌షావలి దర్గాకు పూజ సామగ్రి వితరణగా అందింది. బుధవారం పట్టణానికి చెందిన ఇమ్రాన్, తాజ్‌ఉద్దీన్ రూ.20 వేల విలువచేసే పూజసామగ్రి ముజావర్ సుభాన్‌కు అందజేశారు. కార్యక్రమంలో సుల్తాన్, నౌషాద్, ఖైనూల్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కోట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊను గుంటపాళెంలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో ఒక ఇల్లు దగ్ధమైంది. స్థానికంగా నివాసం ఉంటున్న గురవమ్మ కుటుంబసభ్యులందరూ ఇంటికి తాళంవేసి పొలం పనులకు వెళ్లారు. విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్‌కు గురై మంటలు రేగాయి. స్థానికులు తలుపులు పగలగొట్టి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని ఫర్నిచర్ పూర్తిగా కాలి బూడిదైంది.

నేడు, శనివారం పలు రైళ్ల రద్దు

తడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నేడు (గురువారం), శనివారం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు చెన్నై సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు. కొద్దిరోజులుగా తమిళనాడు కవర్‌పేట - పొన్నేరి మధ్య సిగ్నలింగ్ వ్యవస్థ, రైలు పట్టాల మార్పు పనులు జరుగుతున్నాయి. గురువారం, శనివారం మధ్యాహ్నం 1.20 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఆ రెండు రోజుల్లో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు రద్దు చేశారు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 8.10 గంటలకు బయలుదేరి వెళ్లే మెమూ(66035) రైలు, నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు 10.20 గంటలకు వచ్చే మెమూ(66036) రైలు పూర్తిగా రద్దు చేశారు. అలాగే సూళ్లూరుపేట - చెన్నై మధ్య ఉదయం 5.40, మధ్యాహ్నం 12.35, 1.15, 3.10 గంటలకు నడిచే సబర్బన్ రైళ్లు పూర్తిగా రద్దుచేశారు. మరికొన్ని రైళ్లను పొన్నేరి - గుమ్మిడిపూడి మధ్య పాక్షికంగా రద్దు చేస్తున్నట్లుగా అధికారులు ప్రకటించారు.

పొదుపు సంఘాలకు శిక్షణ

కోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కోటలోని వెలుగు కార్యాలయంలో బుధవారం సంఘబంధ అధ్యక్షులు, వీవోఏలకు శిక్షణ జరిగింది. సంక్షేమ పథకాలు, వాటి వినియోగంపై ఏపీఎం అనీలా శిక్షణ ఇచ్చారు. సంక్షేమ పథకాలు, జీవనోపాధులకు బాటలు తదితర అంశాలపై మహిళలకు అవగాహన పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు శ్రీకాంత్, ప్రసాద్, శంకర్, భాస్కర్, బిందు, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై జడ్పీ సీఈవోకు ఫిర్యాదు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కోటీశ్వరరావుపై నెల్లూరు జడ్పీసీఈవో విద్యారమకు వెంకటగిరి మండలం పారవోలుకు చెందిన ఎంపీటీసీ శ్రీదేవి బుధవారం ఫిర్యాదు చేశారు. గత నెల 29న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో కోటీశ్వరరావు తనను అవమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయండి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘ నేతలు

డక్కిలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): డక్కిలి పంచాయతీ సర్పంచు వేమక్కను అగౌర పరుస్తున్న డక్కిలి పంచాయతీ కార్యదర్శి చైతన్యను సస్పెండ్ చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తలపల చెంచుమల్లి కార్తన డిమాండ్ చేశారు. సర్పంచు వేమక్కతో కలిసి గిరిజన సంఘ నేతలు బుధవారం ఎంపీడీవో గుణశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో వేమక్క భర్త గురించి పంచాయతీ కార్యదర్శి చైతన్య చులకనగా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రాములమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు

ఆటిజంపై అవగాహన సదస్సు

చిల్లకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా ఆటిజం(మందబుద్ధి)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ మూడేళ్ల వయస్సు లోపు పిల్లల్లో ఆటిజం లక్షణాలు కనిపిస్తాయన్నారు. చిన్నతనంలోనే ఆటిజం లక్షణాలను గుర్తిస్తే నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో మాధవయ్య, చంద్ర, మంజుశ్రీ, సుగుణ, మస్తాన్, కామేశ్వరి ఆదిలక్ష్మి, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటిజంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు ఆటిజం ఎందుకు వస్తుందో, వచ్చిన తరువాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో డాక్టర్ జయచంద్ర తల్లిదండ్రులకు క్షుణ్ణంగా వివరించారు. ఆటిజం పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, భవిత కేంద్ర ఉపాధ్యాయులు భార్గవి, సాయిసంధ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రసాయన ఉత్పత్తుల పరిశ్రమల్లో ప్రమాద నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల్లో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రమాదం జరిగినపుడు అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించేలా ఉండాలని సూచించారు. పరిశ్రమల్లో సంబంధిత అధికారుల సమక్షంలో మాక్‌డ్రిల్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజరు సుధాకర్‌రావు, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్ పరికరాల పంపిణీ

చిల్లకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలోని రైతులకు బుధవారం కృష్ణపట్నం రైతు ఉత్పత్తిదారుల కంపెనీ, అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు కేఎఫ్‌పీసీ, ఫౌండేషన్ తోడ్పాటు అందిస్తుందన్నారు. అందులో భాగంగానే గుమ్మళ్లదిబ్బ ప్రాంతంలోని రైతులకు పది డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రమేష్ బాబు, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, షఫీ, సాయినాథ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

25న ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 25న ఈ మెక్టోడియా జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సదస్సుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆటిజం పిల్లల కోసమే భవిత కేంద్రాలు



ఆటిజంపై అవగాహన కల్పిస్తున్న భవిత ఉపాధ్యాయులు

డక్కిలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆటిజం (మందబుద్ధి) పిల్లల కోసమే ప్రభుత్వం భవిత కేంద్రాలను నడుపుతోందని భవిత కేంద్రం నిర్వాహకురాలు కెమ్మసౌమ్య అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో వయసుకు తగ్గట్లు మానసిక పరిపక్వత లేకపోవడం, ఎవరితోనూ కలవకుండా ఒంటరిగా ఉండటం, చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేయడం, గాయాలు తగిలినా తెలుసుకోలేకపోవడం, శబ్దాలను పట్టించుకోకపోవడం, నేరుగా కళ్లల్లోకి చూస్తూ మాట్లాడలేకపోవడం వంటి లక్షణాలను ఆటిజంగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి పిల్లలను భవిత కేంద్రలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, భవిత ప్రత్యేక ఉపాధ్యాయురాలు బాలమేరి పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభలపై శ్రీరామచంద్రుడి తేజస్సు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై కొలువుదీరి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరామ స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రథోత్సవానికి సంబంధించి రథంపై ఏర్పాటు చేసే బంగారు గొడుగుకు ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపుగా రథంపై ప్రతిష్టించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. గురువారం ఉదయం రథోత్సవానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 5.15 గంటలకు మీనలగ్నంలో స్వామివారు రథారోహణం చేస్తారు. మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై శ్రీరామచంద్రుడు

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలు జరుగుతాయన్నారు. భేరివారి మండపం కూడలి వద్ద పార్టీ జెండా ఆవిష్కరణ, అనంతరం ర్యాలీ జరుగుతుం దన్నారు. బీజేపీ కార్యకర్తలు తమ ఇళ్లపై పార్టీ జెండాను ఎగురవేయాలన్నారు. అదే విధంగా 11న జ్యోతిరావు పూలే, 14న అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి పుష్పాంజలి ఘటించాలన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి: సీపీఐ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని కాసాగార్డెన్ సమీపంలో నాయుడుపేట రహదారికి ఆనుకుని గ్రామకంఠం భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. రాజీవ్‌నగర్‌లో రోడ్డు పోరంబోకు స్థలంలో అక్రమంగా నిర్మించిన 120 కట్టడాలను అధికారులు కూల్చివేయడం హర్షణీయమన్నారు. అయితే అంతకన్నా ఖరీదైన నాయుడుపేట రహదారిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఎంజాయ్‌మెంట్ పట్టాను గుట్టు చప్పుడు కాకుండా కొందరు అధికారులు మంజూరు చేసినట్లు ఆరోపించారు. అసలు నిర్మాణం చేపట్టేముందు భూమికి కన్వర్షన్ చేయడంతోపాటు నిర్మాణం కోసం ప్లాన్ అప్రూవల్ చేసే నిబంధన అందరూ పాటించాల్సి ఉంటుందన్నారు. కానీ ఏ ఒక్క ప్రభుత్వ షరతులను పాటించకుండా పూర్తి అక్రమంగా సాగుతున్న నిర్మాణంపై పది రోజుల నుంచి అధికారులు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.

'నా కుమారుడి బారి నుంచి కాపాడండి'

కేవీబీపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువపుత్తూరుకు చెందిన మునెమ్మ తనకు న్యాయం చేయాలని బుధవారం రెవెన్యూ అధికారులను ఆశ్రయించింది. మునెమ్మ భర్త రాగప్పనాయుడు మరణించాడు. ఈమెకు ఇద్దరు కుమారులు సుబ్రహ్మణ్యం, జనార్దన నాయుడు. ఎగువపుత్తూరు సర్వే నెం.52/18ఏ 21 సెంట్లు ఇంటి స్థలం ఉంది. ఇందులో 5 సెంట్లు చిన్నకుమారుడు జనార్దన నాయుడికి రాసిఇచ్చింది. మిగిలిన 16 సెంట్లలో పెద్ద కుమారుడు, ఈమె ఇల్లు నిర్మించుకుని ఉంటున్నారు. చిన్న కుమారుడికి ఎప్పుడో భాగపరిష్కారాలు చేసింది. అయినా చిన్న కుమారుడు ఇంటిని ఖాళీ చేయాలని, ఇక్కడ ఉండొద్దంటూ దాడి చేస్తున్నాడు. ఇంట్లో వాటా ఉందని తన చిన్నకుమారుడు దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడంటూ తహసీల్దారు కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది.

పుత్తూరు వార్తలు

తెలుగుగంగ వచ్చేనా?

● నేడు ఎమ్మెల్యేతో అభివృద్ధి పనులపై అధికారుల సమీక్ష

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న తెలుగుగంగ రాక మరింత ఆలస్యమవుతోంది. ఇప్పటికే పైప్‌లైన్ పనులు ప్రారంభమై అర్ధాంతరంగా నిలిచిపోయింది. ప్రస్తుతం యూఐడీఎస్ కింద రూ.70 కోటలతో డీపీఆర్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ పైప్‌లైన్ పనులు పూర్తయితే పుత్తూరుకు 0.3 ఎంఎల్‌డీ తెలుగుగంగ నీరు చేరుతుంది. ప్రజల దాహార్తిని తీర్చనుంది. ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించేందుకు ఎలాంటి ప్రణాళికలు చేపట్టారో తెలియడం లేదు. బోర్లపై ఆధారపడి ప్రజలకు నీటిని అందిస్తున్నారు. అక్కడక్కడ బోర్లలో నీరు ఎండిపోవడంతో అద్దె బోర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి.

● పట్టణంలో చెత్త నిర్వహణ దయనీయంగా మారింది. పారిశుధ్య పనులు చేయించడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి.

● పేదలకు నాణ్యమైన భోజనం అందించే అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో జాప్యం కొనసాగుతోంది. ఉగాది పండుగ రోజు అనుకున్న ప్రారంభోత్సవం వాయిదా పడింది. పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

● పట్టణ పరిధిలోని మురుగును శుద్ధి చేసి ఇతర అవసరాలకు వినియోగించేందుకు చేపట్టిన ఎస్టీపీల నిర్మాణంలోనూ జాప్యం నెలకొంది. భూసేకరణలో దశలోనే దాదాపు నాలుగు నెలల కాలం వెళ్లదీశారు.

● ట్రాఫిక్ ఇబ్బందులతో పట్టణ ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. రోడ్లను ఆక్రమించి చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను సాగిస్తున్నారు. ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కింగ్ చేస్తున్నారు.

● గోవిందపాళెం వద్ద డంపింగ్ యార్డ్ నిర్వహణ కూడా అత్యంత దయనీయంగా మారింది. వార్డుల్లో అభివృద్ధి పనులు జరిగి ఏళ్లు గడుస్తోంది.

ఈ క్రమంలో ఈనెల 3న పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో చేపట్టనున్న సమీక్షలో ఎమ్మెల్యే భానుప్రకాష్ ఈ అంశాలపై చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటిజంను త్వరగా గుర్తించాలి


పుత్తూరు పట్టణంలో జరిగిన ర్యాలీ

పుత్తూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆటిజం వ్యాధి కాదని, చిన్నపిల్లల్లో మెదడులో వచ్చే నరాల సమస్య అని ఎంఈవో1 తిరుమలరాజు చెప్పారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల(మెయిన్)లోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని పురస్కరించు కుని అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ పిల్లల్లో ఆటిజం లక్షణాలను తల్లిదండ్రులు త్వరగా గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఇక్కడి నిపుణుల సలహాలను ఇంటివద్ద కూడా తర్ఫీదు ఇస్తే మామూలు పిల్లల్లా ఉంటారని అన్నారు. సదస్సు తర్వాత పట్టణంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, స్పెషల్ టీచర్ జగదీశ్వరి, ఆనంద, సూర్యకుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ కార్మికుల నిరసన


డిపో గ్యారేజీ ఎదుట నిరసనలో ఆర్టీసీ సిబ్బంది

పుత్తూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం రెండు రోజుల గేట్ మీటింగ్‌లో భాగంగా బుధవారం ఇక్కడి ఆర్టీసీ గ్యారేజీ ముందు ఎన్‌ఎంయూ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ... 38 సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత నెల 25న ఆర్టీసీ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చినా స్పందించక పోవడం భావ్యం కాదన్నారు. పని ఒత్తిడి కారణంగా కార్మికులు మరణిస్తున్నారని వాపోయారు. ఆరునెలలకు ఒకసారి మెడికల్ చెకప్ చేయాలని, భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలని, విశ్రాంత ఉద్యోగులకు అతిస్వల్ప పెన్షన్ ఉన్నందున రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని కోరారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

వడమాలపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో ఈనెల 3నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు చెప్పారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిసర గ్రామాలకు చెందిన వారు ఆధార్‌లో మార్పులు, చేర్పులకు సరైన ఆధారాలతో దరఖాస్తు అందజేయాలని చెప్పారు.

అప్పలాయగుంటలో వాస్తుహోమం నిర్వహిస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా వాస్తు హోమం

వడమాలపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని4 అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధ్వజస్తంభ సంప్రోక్షణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం వేదమంత్రాలతో అగ్ని, వాస్తు హోమాలను నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో హోమం, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి 8.30 మధ్య కళాపకర్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గీతా సేవా సమాజంలో ఘన స్వర నివాళి

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షి దేవి సమేత సదాశివేశ్వర ఆలయంలో ఉన్న గీతా సేవా సమాజం ఆధ్వర్యంలో ఘన స్వర నివాళిని జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టీటీడీ ఆస్థాన పూర్వ విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ వైకుంఠప్రాప్తి పొందిన సందర్భంగా సుభాషిణి వైద్యశాల సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రేణుక, ఏ.నాగభూషనం వారి బృందం ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలతో 4వ తేది శుక్రవారం సాయంత్రం 6 గంటలకు గీతా మందిరంలో ఘన స్వర నివాళి జరుగుతుందన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా

రేణిగుంట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 19 మందికి రూ.43 వేలను జరిమానాగా న్యాయమూర్తి విధించినట్లు స్టేషన్ రైటర్ గౌరీ నాయుడు పేర్కొన్నారు.

నెత్తురోడుతున్న జాతీయ రహదారి


గత ఏడాది కన్నలి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిత్యం నెత్తురోడుతోంది. నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు ఇటీవల ఆరు లేన్ల జాతీయ రహదారి ఏర్పాటైన విషయం తెలిసిందే. గతంలో నాయుడుపేట నుంచి పూతలపట్టు వరకు ఉన్న ఈ రహదారి ఇరుకుగా ఉండటంతో పెద్దఎత్తున రోడ్డు ప్రమాదాలు సంభవించేవి. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకాళహస్తి - తిరుపతి మధ్య ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో పాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్న ఉద్దేశంతో పీఎస్ రహదారిని ఆరులేన్ల జాతీయ రహదారిగా నిర్మించేందుకు ప్రతిపాదించింది. ఆ మేరకు అదే సంవత్సరం రోడ్డు సర్వేతో పాటు భూసేకరణ ప్రక్రియ కూడా ప్రారంభించారు. 2021లో రహదారి నిర్మాణ పనులు ఆరంభమయ్యాయి. సరిగ్గా 5నెలల క్రితం జాతీయ రహదారిపై రాకపోకలను ప్రారంభించారు. కొత్త రోడ్డు ఆరంభమైన తొలి నాళ్ల నుంచే రోడ్డు ప్రమాదాలతో దుర్మరణాలు మొదలయ్యాయి. ప్రధానంగా శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. పట్టణానికి సమీపంలో ఉన్న తొట్టంబేడు మండలంలోని బసవయ్యపాళెం, కన్నలినుంచి సింగమాల వరకు 5 నెలల్లో 20 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇక బసవయ్యపాళెం నుంచి శ్రీకాళహస్తి పట్టణం 1వ వార్డు పరిధిలో ఉన్న వీఎంపల్లి సమీపంలో ఐదు రోడ్డు ప్రమా దాలు చోటుచేసుకు న్నాయి. మరో వైపు పట్టణ శివార్లలో ఉన్న ఊరందూరు, అలాగే సమీపంలోని చెర్లోపల్లి వద్ద కలిపి వద్ద జాతీయ రహదారిపై సుమారు 14 ప్రమాదాలు జరిగాయి. ముఖ్యంగా శ్రీకాళహస్తికి శివార్లలో ఉన్న రహదారిపైనే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం గమనార్హం.


బసవయ్యపాళెం వద్ద జాతీయ రహదారి

● ప్రమాదాల నియంత్రణకు ప్రాథమిక దశలోనే అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. రహదారిపై ఎక్కడిక్కడ ప్రమాద నివారణ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. రహదారిపై ఆగిఉన్న వాహనాలను ఢీకొట్టే బాధితులు ఎక్కువగా నమోదు అవుతున్నారు. కావున ఎక్కడపడితే వాహనాలు నిలిపే వీలులేకుండా తగు చర్యలు చేపట్టడం ప్రయోజనకరం.

టీడీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి

సత్యవేడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలోని ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. ఎమ్మెల్యే బుధవారం మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం దాసుకుప్పం ఎస్టీ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును, రూ.5లక్షలతో నిర్మించిన శ్మశాన రోడ్డును ప్రారంభించారు. రూ.2లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అక్కడి నుంచి మండల కేంద్రం సత్యవేడుకు చేరుకుని వాటర్ ట్యాంకు కాలనీ, కోటమిట్ట, జడ్పీ హైస్కూల్ తదితర ప్రాంతాల్లో రూ.15 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లను ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ శాఖ కార్యాలయానికి చేరుకుని రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ తమ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుందరరామిరెడ్డి, పరమశివం, లోకయ్యరెడ్డి, జగన్నాథం, చిన్న, బాలమురళి, హేమభూషణం, ప్రభాకర్‌రెడ్డి, పీఎస్ఆర్, అరుళ్, తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, ఎస్ఐ రామస్వామి, ఏఈ ఇబ్రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని ఎంఈవో మునిసుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని కనమనంబేడులో ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే వసతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్య సంవత్సరం నుంచి ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలల కన్నా మంచి బోధన అందుతుందని చెప్పారు. ఉపాధ్యాయురాలు కళ్యాణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లపై దాడి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అన్నదమ్ములైన ఇద్దరు ఆటోడ్రైవర్లపై గుర్తు తెలియని యువకుడు కర్రతో దాడి చేశాడు. బాధితుల కథనం మేరకు శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మునీర్(28), ముజీబ్(24) ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తుంటారు. బుధవారం సాయంత్రం సోదరులు ఇద్దరు కలిసి ఒకే ఆటోలో రాజీవ్‌నగర్ వద్ద వెళుతుండగా ఓ యువకుడు కాపు కాచి కర్రతో దాడికి పాల్పడ్డాడు. దాంతో ఇద్దరు సోదరులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రేపు ఊరందూరుకు అమ్మవారి సమేత ముక్కంటీశుడు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఊరందూరులోని నీలకంఠేశ్వరాలయానికి ఉదయం 9గంటలకు చేరుకుంటారు. అక్కడ స్వామిఅమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం అక్కడి నుంచి బయలుదేరి పానగల్, అగ్ర హారం, సన్నిధివీధి, నాలుగు మాడవీధుల్లో ఊరేగిన అనంతరం ఆలయానికి చేరుకుంటారు.

పట్టణంలో పోలీసు కవాతు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పోలీసు కవాతు నిర్వహించామని డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం రాత్రి శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది పెండ్లి మండపం కూడలి నుంచి పట్టణవ్యాప్తంగా కవాతు నిర్వహించారు. వ్యాపారులు సమయపాలన పాటించడంతో పాటు అనవసరంగా రోడ్లపై రాత్రివేళ ఆకతాయిలు తిరగకుండా హెచ్చరించారు.

మండలాభివృద్ధికి సహకరించండి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మునిలక్ష్మి

కేవీబీపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు మండలాభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మునిలక్ష్మి ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీఈవో రాధారాణి ఒక్కో శాఖ అధికారి ద్వారా అభివృద్ధి ప్రణాళికలను వివరించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు తెలిపారు. అయితే సమావేశం చప్పగా సాగిందని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు విమర్శించారు. ముఖ్యమైన అధికారులు హాజరుకాకుండా ఆయా శాఖలకు సంబంధించిన చిన్న ఉద్యోగులను పంపించినట్లు వాపోయారు. 3 నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి పెద్ద అధికారులు రాకుండా కార్యాలయంలో పనిచేసే సిబ్బంది పంపడం సరికాదన్నారు. ఎంపీడీవో రాధారాణి మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. జడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, వైస్ ఎంపీపీ సరస్వతి, తహసీల్దారు మునిరత్నం రెడ్డి, ఎంఈవో లక్ష్మీపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేంద్రబాబు తదితరులు హాజరయ్యారు.

ముక్కంటి సేవలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి


ఆలయ ధ్వజస్తంభం వద్ద ప్రజ్ఞానంద సరస్వతి - కుటుంబ సభ్యులతో సంగీత దర్శకుడు కోటి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని బుధవారం పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. మురళి, స్వరూప్, భాస్కర్, మోహన్‌బాబు, రాజ్‌కుమార్ ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఇక సినీ సంగీత దర్శకుడు కోటి కుటుంబ సమేతంగా దర్శించుకున్న వారిలో ఉన్నారు.

పొద్దుతిరుగుడు సాగుతో అధిక లాభాలు


క్షేత్రస్థాయి పరిశీలనలో శాస్త్రవేత్తలు

కేవీబీపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పొద్దుతిరుగుడు పంటతో అధిక లాభాలు పొందవచ్చని రాస్ కేవీకే మిషన్ సీనియర్ శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, దివ్య తెలిపారు. మండలంలోని తిమ్మసముద్రం, రాయపేడు, రామకృష్ణాపురంలో ఈ యేడాది ఆహార భద్రత మిషన్ సహకారంతో పొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేసి రైతులతో డిసెంబర్‌లో విత్తించారు. దీనిపై బుధవారం క్షేత్రస్థాయి ప్రదర్శన ఏర్పాటు చేసి రైతులకు పంట పండించే విధానాన్ని, వాటి లాభాలను తెలిపారు. మంచి విత్తనాలు నాటితే 90 నుంచి 95రోజుల్లో హెక్టార్‌కు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మురళీకృష్ణకుమార్, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, రాస్ కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, సుధ పాల్గొన్నారు.

పోషణ లోపం తగ్గించాలి


అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలిస్తున్న పీడీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో పోషణ లోపం తగ్గించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల పీడీ వసంతబాయి అన్నారు. శ్రీకాళహస్తి ఐసీడీఎస్ పరిధిలోని రాచగున్నేరి, ఊరందూరు రోడ్డు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. పిల్లల హాజరు, ఎత్తు, బరువు, పోషణ స్థితిని గుర్తించారు. ఐసీడీఎస్ సేవలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నోడల్ ఆఫీసర్ వాసంతి, సీడీపీవో శాంతి దుర్గ, సూపర్‌వైజర్లు, సర్పంచ్ రాజు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆటిజం దినోత్సవం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భవిత పాఠశాలలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మునిసుబ్రమణ్యం మాట్లాడుతూ వయసుకు తగ్గట్లు పిల్లల్లో రావాల్సిన మానసికపరమైన ఎదుగుదల రాకుండా ఉండే పరిస్థితిని ఆటిజం అంటారన్నారు. ఈ సమస్య పిల్లల్లో బాల్య దశలోనే ప్రారంభమై జీవిత కాల సమస్యగా మారుతుందన్నారు. పాఠశాల హెచ్ఎం ఉమామహేశ్వరి, విజయ కుమార్, భవిత స్కూల్ ఉపాధ్యాయులు అయ్యప్పరెడ్డి, నయోమి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్, ఉపాధ్యాయులు జయప్రకాష్, వెంకటరమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పెన్షనర్స్ డే

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పటణంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలోని చెంచు లక్ష్మి కాలనీలో ఉన్న పెన్షనర్స్ భవనంలో శుక్రవారం పెన్షనర్స్‌డే నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకయ్య తెలిపారు. ఇందులో భాగంగా 25మంది సీనియర్ ప్రభుత్వ ఉద్యోగులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. పెన్షనర్స్ సంఘ సభ్యులు పెద్దసంఖ్యలో విచ్చేయాలని కోరారు.

కోర్టుకు హాజరైన జనసేన నాయకులు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల జనసేన నాయకులు బుధవారం సత్యవేడు కోర్టుకు వాయిదా నిమిత్తం హాజరయ్యారు. గత సంవత్సరం జూలై 11న వలంటీర్లు పవన్ కల్యాన్ దిష్టిబొమ్మను దహనం చేయడంతో జనసేన జిల్లా కార్యదర్శి తడ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బస్టాండు ఆవరణలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దీంతో జనసేన కార్యకర్తలపై వైసీపీ నాయకులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు వాయిదా నిమిత్తం బుధవారం వారు హాజరయ్యారు.

స్కూల్ బస్సుల నిర్వహణపై నిర్లక్ష్యం తగదు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సుల నిర్వహణపై యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి ఆర్టీవో దామోదర నాయుడు హెచ్చరించారు. పట్టణంలోని జయరామరావువీధిలో మంగళవారం మధ్యాహ్నం ఓ ప్రైవేటు స్కూల్ బస్సు మొరాయించడం.. విద్యార్థులు ఆ బస్సును తోయడం వంటి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం తెలిసిందే. దీనిపై బుధవారం ఆర్టీవో సంబంధిత పాఠశాలకు చేరుకుని బస్సును స్వయంగా నడిపి చూశారు. బస్సులోని విద్యార్థులను గమ్యస్థానం చేర్చేవరకు ఎక్కడా దించకూడదని సూచించారు.

పగడాల ప్రవీణ్ మృతిపై పోలీసులు దర్యాప్తు చేయాలి

పిచ్చాటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాస్టర్లు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పగడాల ప్రవీణ్ మృతిపై అనేక అనుమానాలున్నాయని, వాటిని పోలీసులు వెంటనే దర్యాప్తు చేసి కారణాలను వెలికి తీసి హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రవీణ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడంపై ప్రభుత్వం మహిళా సంఘాలకు సభ్యులుగా శిక్షణ ఇస్తున్నట్లు వెలుగు ఏపీఎం మునెయ్య తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాలకు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికపై బుధవారం రెండో బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నిర్దేశించిన విధంగా ఒక కుటుంబంలో ఒక జీవనోపాధి లక్ష్యానికి అనుగుణంగా జీవనోపాధి చేపట్టి వ్యాపారవేత్తగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, సమాఖ్య లీడర్లు, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

వరదయ్యపాళెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 3న గురువారం ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి తెలిపారు. చిన్నపాండూరు పంచాయతీ వీకేఆర్‌పై కాలనీలో సిమెంటు రోడ్లు, గోకులం షెడ్లను ప్రారంభిస్తారని తెలిపారు. మండల అధికారులు, కూటమి నాయకులు ఈ కార్యక్రమాలకు హాజరు కావాలని కోరారు.